క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్ : వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. శ్రీనివాసపురంలో పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ప్రజలకు చల్లటి మంచినీళ్లను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోల్నాటి రాజా, జుజ్జవరపు రామకృష్ణ, తగరం దుర్గారావు, కర్పూరం నారాయుడు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు ప్రారంభం

లింగపాలెం : అన్నపనేనివారిగూడెం గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ దొడ్డిగర్ల రవీంద్ర సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కలిప్తున్న ఉపాధి హామీ పనులను ఉపాధి కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో ఉపాధి పనులకు కూలీల హాజరుశాతం పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఏపీవో జిల్లా వరలక్ష్మి, టీఏ నరసయ్య, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం.. సువర్చలా హనుమద్ కల్యాణం



సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : ఆంజనేయస్వామి జన్మనక్షత్రం పూర్వాభాద్రా నక్షత్రం పురస్కరించుకుని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి క్షేత్రంలో సోమవారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణాన్ని వీక్షించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆర్థిక సహాయం అందజేత

కామవరపుకోట : ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి నిరాశ్రయులైన స్థానిక వైకాలనీకి చెందిన కొప్పిశెట్టి సత్యవతికి సోషల్ వర్కర్ వీరమల్ల మధు ఆధ్వర్యంలో రూ.15,850 నగదు, రెండు ఇనుప మంచాలు, బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ వీరమల్ల మధు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా నిలిచిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్నంగి శ్రీనివాస్, మునునూరి వెంకటేశ్వరరావు, కానూరి సతీష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన

జంగారెడ్డిగూడెం : అగ్నిప్రమాదాలు, నివారణ చర్యలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జంగారెడ్డిగూడెం ఫైర్ అధికారి జి.అబ్రహ్మం అన్నారు. 4వ రోజు స్థానిక విద్యావికాస్ పాఠశాలలో సోమవారం అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు సంభవించే తీరు, అగ్నిమాపక యంత్రాలు వినియోగించే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కామవరపుకోట : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

గురవాయిగూడెం ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలుపై శిక్షణ

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం రైతు భరోసా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేఆర్ పురం వ్యవసాయ శాఖ ఏడీఏ పీజీ బుచ్చిబాబు ధాన్యం కొనుగోలులో తీసుకోవాల్సిన నాణ్యతా ప్రమాణాలు, రాయాల్సిన రిజిస్టర్ల గురించి వివరించారు. సివిల్ సప్లై కార్యాలయ టీఏ జి.త్రివేణి మాట్లాడుతూ ధాన్యంలో తేమ శాతం చూడటం, నూకశాతం తెలుసుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి కేవీఎస్ పోశారావు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలంలో 6,300 ఎకరాలు వరి సాగు చేసినట్లు, దీనికి సంబంధించి 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. వరి కోత పూర్తయిన రైతులు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

మే 13న లోక్‌అదాలత్

జంగారెడ్డిగూడెం : లోక్ అదాలత్‌లతో కేసులు పరిష్కారం చేసుకోవడంతో సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి ఆర్ వరలక్ష్మి తెలిపారు. మే 13న జంగారెడ్డిగూడెం న్యాయస్థానాల ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మనోవర్తి కేసులు, బీఎస్ఎన్ఎల్, బ్యాంకు మొండి బకాయి వంటి కేసులు రాజీ చేసుకోవచ్చని తెలిపారు.

గడపగడపకు సంక్షేమ లబ్ధి





రామన్నగూడెంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, చింతలపూడిలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

బుట్టాయగూడెం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు మెచ్చిన పాలన అందిస్తోందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. రామన్నగూడెంలో సోమవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. అలాగే మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌లను ఇంటి తలుపులకు అతికించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరుతుందని అన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి అనేక పథకాల అమలుతో రాష్ట్రానికి దేశంలోనే మంచి గుర్తింపు వచ్చిందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామాల్లో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, జెడ్పీటీసీ మొడియం రామతులసి, ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, కోఆప్షన్ సభ్యులు షేక్ సయ్యద్ బాజీ, సర్పంచ్‌లు బన్నే బుచ్చిరాజు, మాల్చి వెంకన్నబాబు, ఎంపీటీసీ సవలం కోటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ సచివాలయం-1 పరిధిలోని ఘంటావారి వీధిలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి అందిన లబ్ధిని చదివి వినిపించి బుక్‌లెట్లు అందచేశారు. సాంకేతిక కారణాలతో ఎవరికైనా పథకాలు అందకపోతే అధికారులతో మాట్లాడి వారికి కూడా పథకాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా.బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ మొలుగుమాటి నీరజ, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, మండల యూత్ కన్వీనర్ వెంపా కృష్ణ, గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు మిరియాల దిలీప్, ఎస్టీ సెల్ నాయకులు రామరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

30లోగా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

జంగారెడ్డిగూడెం : పాలిసెట్ - 2023కు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పరీక్షలు ముగిసినందున విద్యార్థులందరూ పాలిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల 10వ తేదీన పాలిసెట్ పరీక్ష జరుగుతుందన్నారు. ఏలూరు జిల్లా అభ్యర్థులంతా ఏలూరులో ఏర్పాటు చేయబడిన 4 సెంటర్లలో పరీక్ష రాయవలసి ఉంటుందన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ పరీక్ష కోసం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

జంగారెడ్డిగూడెం : బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, ఇందుకు అన్ని పార్టీలు సహకరించాలని జంగారెడ్డిగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు చిలుకూరి సాయిబాబ అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం నిర్వహించిన పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాహ్మణులు ఐక్యంగా ఉండి అన్ని రంగాల్లో రాణించాలన్నారు. జంగారెడ్డిగూడెంలో బ్రాహ్మణ సంక్షేమ భవన నిర్మాణం త్వరలో చేపడతామని, సభ్యులు సహకరించాలన్నారు. అలాగే సభ్యులందరూ సభ్య రుసుము చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో లంకా వెంకట నాగకుమార్, సమయమంత్రి రాధాకృష్ణ, శ్రీనివాస బాలగణపతిరావు, చిలుకూరి లక్ష్మీనారాయణ, ఆకెళ్ల పవన్, చిర్రవూరి సీతాపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చడంపై పునరాలోచన చేయాలి



బుట్టాయగూడెంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేరుస్తూ ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు మాట్లాడుతూ బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శారా శాంతికి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ కమిటీ వైస్ చైర్మన్ కుర్సం దుర్గారావు, ప్రధాన కార్యదర్శి సోదెం ముకయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఏఐకేఎమ్ఎస్ ఆధ్వర్యంలో

బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆ సంఘ నాయకులు ధర్మల సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం వల్ల గిరిజనులకు అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.

కుక్కునూరు : బోయ, వాల్మీకీ, మెంతు, ఒరియా కులాలను షెడ్యూల్ తెగల జాబితాలో కలపొద్దని కోరుతూ సోమవారం ఆదివాసీ జేఏసీ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ డీఎల్ ప్రమద్వరకు వినతి పత్రం అందించారు. ఆదివాసీ జేఏసీ నాయకులు కూరం సంజీవరావు, వర్సా నాగేశ్వరరావు, పైదా పరమేశ్వరావు, చిన్నబాబు, మడకం వెంకటేశ్వర్లు, అడవి రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి

జంగారెడ్డిగూడెం : స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్య ఎప్పటిలోగా పరిష్కారమవుతుందో, పరిష్కారానికి అవకాశం ఉందో లేదో, సాంకేతికపరమైన సమస్యలు ఏమైనా ఉన్నాయా తదితర విషయాలను అర్జీదారులకు తెలియజేసి, వాటిని పునరావృత్తం కాకుండా పరిష్కరించాలన్నారు. కాగా సోమవారం వచ్చిన అర్జీల్లో జంగారెడ్డిగూడెంకు చెందిన తానిగడప త్రివేణి కళ్యాణమస్తు పథకం గురించి దరఖాస్తు చేయగా, ఎం.రహమాన్ తన ఇంటివైపుగా నిర్మాణాలు చేస్తున్నారని, పరిశీలించి చర్యలు తీసుకోవాలని, బంటుమిల్లి శ్రీనివాసరావు, పేరంపేటకు చెందిన కంకిపాటి కుమారి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం కోసం, కలపాల కోటయ్య రక్షణ కోరుతూ, మర్లగూడెంకు చెందిన కన్నాబత్తుల మోహనరావు భూమిని ఆన్‌లైన్ చేయాలని, ఇంకా పలువురు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేసినట్లు ఆర్డీవో తెలిపారు.

గుణ్ణంపల్లిలో బీసీ బహిరంగ సభ



నూతన కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న బీసీ నేతలు

ద్వారకాతిరుమల: మండలంలోని గుణ్ణంపల్లిలో ఏపీ బీసీ చైతన్య సమితి ఆధ్వర్యంలో సోమవారం బీసీ బహిరంగ సభను నిర్వహించారు. ఏపీ బీసీ చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బీసీ రమణ, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్కాపురం కనకారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు బొండాడ వెంకన్నబాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. బీసీ కుల జన గణనను వెంటనే చేయాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాన ఎజెండాతో ఈ సభను నిర్వహించినట్టు ఏలూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడు యడ్లపల్లి నటరాజు తెలిపారు. ఈ సందర్భంగా పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు.

‘తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించలేదు’

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం తహసీల్దార్ విధులకు తాను ఆటంకం కలిగించలేదని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి దువ్వెల సృజన అన్నారు. సోమవారం సాయంత్రం మండలంలోని తూర్పురేగులకుంట వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె తనపై నమోదైన కేసుపై వివరణ ఇచ్చారు. తూర్పురేగులకుంటకు చెందిన దుర్గమ్మ అనే మహిళకు సంబంధించిన భూమి విషయంపై ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని ఆయన డాక్యుమెంట్స్ ఇవ్వమని చెప్పడంతోనే తహసీల్దార్‌ను కలవడానికి వెళ్లానని, తాను ఎటువంటి బెదిరింపులకు పాల్పడలేదని ఆమె స్పష్టం చేశారు.

సీలింగ్ భూములను పేదలకు పంచాలి

జంగారెడ్డిగూడెం : మండలంలోని పంగిడిగూడెంలో ఉన్న సీలింగ్ భూములను పేదలకు పంచాలని ఏఐకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి, ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జొన్నకూటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ 32 ఎకరాల సీలింగ్ భూమికి అక్రమ పద్ధతిలో పట్టాదార్ పాస్‌పుస్తకాలు ఇచ్చారని, వాటిని రద్దు చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సీలింగ్ భూములను పేదలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర లీగల్ అడ్వైజర్ తొర్లపాటి శ్రీనివాస్, మడకం రామన్న, దుర్గారావు, వీరాస్వామి, మట్టపర్తి వెంకట్రావు, పాడపాటి ఏసు, అందుగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం మోపనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎస్.రాంబాబు సోమవారం హెచ్చరించారు. ఇప్పటికే అక్రమంగా వేసిన లేఅవుట్ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. స్థల యజమానులు డీటీసీపీ అనుమతి తీసుకున్నాకే లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించుకోవాలని చెప్పారు. 1995 మున్సిపాలిటీ చట్టంలోని టౌన్ ప్లానింగ్ రూల్స్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీటీసీపీ అనుమతి లేని లేఅవుట్లలో నగర పంచాయతీ మౌలిక సదుపాయాలు కల్పించదని తెలిపారు. వినియోగదారులు అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పోలవరం రూరల్ : పోలవరం మండలం గూటాల సమీపంలో ప్రధాన రహదారిపై రెండు టీవీఎస్ మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో ఇద్దరిని కొవ్వూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

టి.నరసాపురం : బొర్రంపాలెం, కన్నప్పగూడెం గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై సోమవారం టి.నరసాపురం పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో బొర్రంపాలెంలో నాటు సారా విక్రయిస్తున్న వి.వెంకటేశ్వరరావును, కన్నప్పగూడెంలో నాటు సారా తయారు చేస్తున్న వి.నాగరాజును అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సతీష్ తెలిపారు. వీరి వద్ద నుంచి 5 లీటర్ల చొప్పున సారా స్వాధీనం చేసుకుని కన్నాయిగూడెంలో నాటు సారా స్థావరాన్ని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు.



సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం



జంగారెడ్డిగూడెం 13వ వార్డులో బ్రోచర్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు



కొయ్యలగూడెంలోని పరింపూడి ప్రాంతంలో కరపత్రం అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : రాష్ట్రంలో సంక్షేమ పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, 13వ వార్డు కౌన్సిలర్ పీపీఎన్ చంద్రరావు అన్నారు. పట్టణంలోని ఐదవ సచివాలయం పరిధిలో జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇన్ని సంక్షేమ పథకాలు అమలు జరగడంలేదని, మన రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇంటింటికి వెళ్తున్న తమకు ప్రతి ఒక్కరూ సాదర స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు గూడపాటి రాధాకృష్ణ, పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు పడమటి గిరిబాబు గౌడ్, మండల సచివాలయ కమిటీ మేనేజర్ పంది రాజా, ఆర్.శ్రీను, సీహెచ్.రాంబాబు, నాగబాబు, మహాత్మా, బిక్కు, ఆశీర్వాదం, ఎం.సత్యనారాయణ, రవి, వరప్రసాద్, మనీషా, శ్రావణి, శ్యామల, ఉషారాణి, సాయి, రెహ్మాన్, కీర్తి, జగన్నాథ రావు తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. సోమవారం జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం 9వ సచివాలయ పరిధిలో 25వ వార్డులోని ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కన్వీనర్ బత్తిన చిన్న, గుబ్బల వెంకటేశ్వరరావు, గెద్దాడ రాజు, ఒకటో వార్డు కౌన్సిలర్ ముప్పానిరమణ, షేక్ సుభాని, బల్ల నాని తదితరులు పాల్గొన్నారు.

పరింపూడిలో మా నమ్మకం నువ్వే జగన్

కొయ్యలగూడెం: మండలంలోని పరింపూడిలో సోమవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు ఏలేటి భాస్కర్ ఆధ్వర్యంలో సచివాలయా కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాలను తెలుసుకుని నమోదు చేసుకున్నారు. అనంతరం గృహ యజమానుల అనుమతితో వారి ఇంటి తలుపులకు జగనన్న స్టిక్కర్లను అతికించారు. రేపల్లెవాడ, అంకాలగూడెం, గవరవరం, చొప్పరామన్నగూడెం ప్రాంతాలలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలను నిర్వహించారు.

జగన్ పాలనపై ప్రజలకు విశ్వాసం

చింతలపూడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలు విశ్వాసంతో ఉన్నారని నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్ దుర్గారావు అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ పరిధిలో సోమవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్‌లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు గత ప్రభుత్వానికి జగనన్న ప్రభుత్వానికి ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.కాంతారావు, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఎం దిలీప్, కె వెంకటేశ్వరరావు, ప్రకాష్, వై కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన మానమ్మకం నువ్వే జగన్

లింగపాలెం : ముడిచెర్ల గ్రామంలో సోమవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ వడ్లాని హరినాథ్‌రాజు, ఎంపీటీసీ వి శ్రీలలిత, మార్కెట్ యార్డు డైరెక్టర్ ముత్యాల రాధాకృష్ణ, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు కలసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాలు ఏమేరకు అందుతున్నాయనే విషయాలను వారిని అడిగి తెలుసుకున్నారు. గృహ యజమానుల అనుమతితో ఇంటికీ సీఎం వైస్ జగన్ స్టిక్కర్‌ను అతికించారు.

పోలవరం రూరల్ : జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పోలవరం మండలంలోని ప్రతి గ్రామంలో ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తూ స్టిక్కర్లను అంటిస్తున్నారు. గూటాల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పాల్గొని ప్రభుత్వం పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ, పోలవరం, జిల్లెళ్లగూడెం, ఎల్ఎన్‌డీపేట పంచాయతీల పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు గృహసారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు.



చింతలపూడిలో ప్రజలకు బుక్‌లెట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



కొత్తపల్లిలో స్టిక్కరింగ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ హరినాథ్‌రాజు, పార్టీ నేతలు



గూటాలలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పార్టీ శ్రేణులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పోలవరం డివిజన్
9951602915 (పోలవరం)
9505508399 (చింతలపూడి)
Office mail : tpgadvt@gmail.com